క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ యాదయ్య తండ్రి జంగయ్య శనివారం కన్నుమూశారు. ఆదివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యా నాయక్, నాయకులు నిరంజన్‌గౌడ్, రాములు, రమేశ్‌నాయక్, శ్రీను, ఆంజనేయులు, గణేశ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు



మొండిగౌరెల్లిలో బోనాల ఊరేగింపు

యాచారం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మొండిగౌరెల్లి, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాన్ని సమర్పించారు. ఉత్సవాల్లో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. ప్రజలు ఉత్సాహంగా బోనాల ఊరేగింపులో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది.

భక్తి శ్రద్ధలతో...

కడ్తాల్: మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ గ్రామంలో పోచమ్మ బోనాల పండుగను ఆదివారం సాయంత్రం గ్రామ ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మహిళలు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. పాడి పంటలతో చల్లంగా చూడాలని తల్లిని కోరుకున్నారు. యువకుల నృత్యాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బోనాల ఉత్సవాల్లో గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవ పత్రిక ఆవిష్కరణ



కల్యాణోత్సవ పత్రికను ఆవిష్కరిస్తున్న వీరశైవ లింగాయత్‌లు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో శ్రీ పార్వతిపరమేశ్వరుల కల్యాణోత్సవ పత్రికను ఆదివారం వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం నేతలు ఆవిష్కరించారు. ఈనెల 10వ తేదీ ఉదయం 11 గంటలకు కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నామని భక్తులు హాజరుకావాలని కోరారు.

ఆలయ అభివృద్ధికి రూ. లక్ష విరాళం



ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న విక్రం తదితరులు

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ముర్తుజపల్లి గ్రామంలో ఎల్లమ్మ ఆలయం అభివృద్ధికి బీఆర్‌ఎస్ నాయకుడు విక్రం ఆదివారం రూ.1 లక్ష విరాళాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. అనంతరం ఆలయం వద్ద ప్రహరీగోడ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా విక్రం మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి పూర్తిగా సహకరిస్తామని చెప్పారు. స్థానిక నాయకులు శ్రీను, మల్లేశ్, పర్వతాలు, లక్ష్మమ్మ, రాములమ్మ, ఎల్లమ్మ పాల్గొన్నారు.

బొడ్రాయి, పోతలింగన్నకు అభిషేకాలు



బొడ్రాయికి అభిషేకం చేస్తున్న గ్రామస్తులు

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న బొడ్రాయి (నాభిశిల), పోత లింగన్న స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల్లో భాగంగా ఆదివారం బొడ్రాయి, పోతలింగన్న విగ్రహాలకు గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి తీసుకువచ్చిన నీరు, పాలు, పుష్పాలతో అభిషేకాలు నిర్వహించారు.

కల్వర్టు ఇలా.. ప్రయాణం ఎలా?



సాహెబ్‌గూడ సమీపంలో ఫిరంగి నాలాపై శిథిలావస్థలో కల్వర్టు

మరమ్మతులు కరువు
- భయాందోళనకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని సాహెబ్‌గూడ నుంచి కొంగరకలాన్‌కు వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. గతేడాది కురిసిన వర్షాలకు ధ్వంసమైన కల్వర్టుకు అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. ఈ రహదారి నుంచే కొంగర కలాన్, కలెక్టరేట్, రావిర్యాల్, ఎంపీపటేల్‌గూడ, మంగళ్‌పల్లి ప్రాంతాలకు రాకపోకలు కొనసాగుతున్నాయి. కల్వర్టు ఇరువైపుల గోడలు కూడా ధ్వంసమయ్యాయి. కొంగరకలాన్ నుంచి ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులోకి వెళ్లే ప్రధాన కాలువ కావడంతో నీటి ఉధృతి అధికంగా ఉంటుంది. నీటి ప్రవాహం పెరిగితే కూలిపోవడం ఖాయమని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్, పంచాయతీ రాజ్ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ఆదిబట్ల పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



సాహెబ్‌గూడ– కొంగరకలాన్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తాం.

పొట్టి రాములు, కౌన్సిలర్, ఆదిబట్ల

ఎమ్మెల్యే దృష్టికి..



కల్వర్టు ధ్వంసమైన విషయాన్ని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కరించేలా చూస్తాం. రాష్ట్ర ప్రభుత్వం చెరువులు, కుంటల మరమ్మత్తులకు కృషి చేస్తోంది.

వయ్యిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆదిబట్ల

వడ్డెర్లకు పూర్తి హక్కులు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న విఘ్నేష్

తుర్కయంజాల్: వడ్డెర వృత్తిదారులకు గుట్టలు, క్వారీలపై పూర్తి హక్కులను కల్పించాలని వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఘ్నేష్ డిమాండ్ చేశారు. ఆదివారం తుర్కయంజాల్‌లో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచిన వడ్డెర వృత్తిదారులు నేటికి సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని వాపోయారు. రాష్ట్రంలో 4 వేలకు పైగా సొసైటీలున్నా ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా నిధులు కేటాయించలేదని, పనిచేస్తూ మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా కూడా దక్కడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రూ. 10 లక్షలతో వడ్డెరబంధు పథకాన్ని అమలు చేయాలని, బీమా సౌకర్యం కల్పించాలని, ఇళ్లు లేని వారికి ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, మల్లేశ్, సత్యం, అంజి, శ్రీను, శ్రీను, వెంకన్న సైదులు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరాధారమైన ఆరోపణలు మానుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్ తదితరులు

మంచాల: నిరాధారమైన ఆరోపణలు కాంగ్రెస్ పార్టీ నాయకులు మానుకోవాలని బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు శేఖర్ అన్నారు. ఆదివారం మంచాలలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులే భూ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు మానుకోవాలన్నారు. ప్రజలు వాస్తవాలు గమనించి కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పాలని కోరారు. స్థాయిని మించి మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు వీరేశ్, విజయ్, మల్లప్ప, ప్రవీణ్, సూర్యం తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీపై స్పష్టత ఏదీ?

ఎంపీపీ కొప్పు సుకన్య

యాచారం: రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తున్నామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చి పక్షం రోజులు గడుస్తున్న స్పష్టత లేదని ఎంపీపీ కొప్పు సుకన్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 శాతం మంది రైతులకే మాఫీ వర్తించినట్లు స్వయంగా బ్యాంకు అధికారులు చెబుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే పూర్తి రుణమాఫీ అమలు చేస్తామని తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే పేదలకు లబ్ధి



మోహన్‌రెడ్డి

తలకొండపల్లి: కాంగ్రెస్ పాలనలోనే పేదలకు మేలు జరిగిందని పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. పేదల ఆర్థికాభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని గుర్తు చేశారు. మండల కేంద్రంలో ఆయన ఆదివారం మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. విభేదాలు పక్కన పెట్టి పార్టీ గెలుపుకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలీలకు జనాభా ప్రాతిపదికన సీట్లు

పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు



ర్యాలీ నిర్వహిస్తున్న పద్మశాలీ సంఘం నాయకులు

కడ్తాల్: రానున్న ఎన్నికల్లో పద్మశాలీలకు జనాభా ప్రాతిపదికన ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో పద్మశాలీ శంఖారావం సభ నేపథ్యంలో ఆదివారం కడ్తాల్‌లో పద్మశాలి సంఘం నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ పద్మశాలీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుని వదిలేస్తున్నాయని ఆరోపించారు. హక్కుల కోసం ఐక్యమత్యంతో ఉద్యమించాలని కోరారు. రాష్ట్రంలో 40 లక్షల మంది పద్మశాలీలు ఉన్నారని, ఒక్కరు కూడా అసెంబ్లీలో లేరని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు అంజయ్య, శ్రీరాములు, యాదయ్య, వెంకటేశ్, శేఖర్ నేత, చంద్ర ప్రకాశ్, పాండు, గిరి, రాఘవేందర్, భూపాల్, గోపీ, శేఖర్ తదితరులు ఉన్నారు.

నేడు టీడీపీ మహాధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న యాదీలాల్

ఆమనగల్లు: బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద సోమవారం టీడీపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర లీగల్‌సెల్ కార్యదర్శి, కల్వకుర్తి టీడీపీ ఇన్‌చార్జి యాదీలాల్ తెలిపారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో నియంత, అరాచక, అవినీతి పాలన కొనసాగుతోందని విమర్శించారు. అవినీతి పాలనను అంతం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మహాధర్నాను ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు భాస్కర్, మల్లయ్య, పెంటయ్య, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి



డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: యువత అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి కోరారు. ఆమనగల్లులో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గంలో యువతీ యువకులకు ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాములు, పట్టణాధ్యక్షుడు మానయ్య, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, నాయకులు అనిల్‌గౌడ్, రాజశేఖర్, శ్రీరాములు, మైసయ్య, జంగయ్య, అలీం, కృష్ణ, శ్రీదర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



కడ్తాల్: ఆర్థిక సహాయం అందజేస్తున్న దశరథ్

కడ్తాల్: మండలంలోని న్యామతాపూర్ గ్రామానికి చెందిన రాంచంద్రయ్య అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ దశరథ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ కుటుంబానికి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో సర్పంచ్‌లు రవీందర్‌రెడ్డి, సులోచనసాయిలు, ఎంపీటీసీ గోపాల్, నాయకులు మహేశ్, జానకీరామ్, మల్లేశ్, యాదగిరి తదితరులు ఉన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని ఎడవెల్లికి చెందిన జంగమ్మ ఇటీవల మృతి చెందింది. అయితే ఆదివారం ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ శ్రీనివాసు రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. వ్యక్తిగతంగా రూ. 5,000 ఆర్థికం సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మల్లేశ్, శ్రీను, రవి, బాలమల్లయ్య, కల్యాణ్, రాములు, యాదయ్య, బుజ్జయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సారూ.. వినండి మా గోడు

జేఏసీ నాయకులు



దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు తదితరులు

తలకొండపల్లి: 'మా గ్రామాన్ని, మమ్ములను పట్టించుకోండి. మా గోసా వినండి సారూ' అని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని అధికారులను ప్రాధేయపడుతున్నారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారానికి 63వ రోజుకు చేరుకున్నాయి. 63 రోజులుగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇప్పటివరకు దీక్షా శిబిరాన్ని సందర్శించలేదన్నారు. అవసరాల నిమిత్తం మండల కేంద్రమైన తలకొండపల్లికి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నామని, ప్రజా శ్రేయస్సు దృష్ట్యా గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో దామోదర్, రేణురెడ్డి, డేవిడ్, రాజశేఖర్, చంద్రయ్య, అంజయ్య, నాగయ్య, నరసింహ, జంగయ్య, కృష్ణయ్య, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం



ఇంజాపూర్‌లో రోడ్డు పక్కన చెత్త

- ప్రబలుతున్న సీజనల్ వ్యాధులు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధిలో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. చాలా కాలనీల్లో ఎక్కడ పడితే ఎక్కడ చెత్త డంప్ చేస్తుండటం అధికారులు, పాలకుల నిర్లక్ష్యాన్ని రుజువు చేస్తోంది. ఇంజాపూర్ నుంచి సాహెబ్‌నగర్‌కు వెళ్లే దారిలో రోడ్డు పక్కన చాలా రోజులుగా చెత్త, వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. చుట్టు పక్కల కాలనీల్లో నివసించే వారిలో చాలా మంది చెత్తను సేకరించే స్వచ్ఛ ఆటోలకు ఇవ్వకుండా రోడ్ల పక్కన, బహిరంగ ప్రదేశాల్లో ఇష్టానుసారంగా డంప్ చేస్తున్నారు. దీంతో దోమలు, ఈగలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది డెంగ్యూ, వైరల్ ఫీవర్‌తో సతమతమవుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి చెత్తను తొలగించడంతో పాటు, బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు

- గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత
- ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



కిషన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

ఇబ్రహీంపట్నం: ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకుడు చెరుకూరి రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం పోలక్కంపల్లి, మన్నెగూడ గ్రామాలకు చెందిన ఉస్మాన్, ఇస్మాయిల్, అహమ్మద్, నజీర్, బాలయ్యలకు కిషన్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నర్సింహ్మా, రవీందర్‌రెడ్డి, షరీఫ్, దానయ్య, యాదయ్య పాల్గొన్నారు.

పట్టణమంతా ఆధ్యాత్మిక శోభ



పోచమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

- ఘనంగా బోనాల ఉత్సవాలు
- పోచమ్మ, మైసమ్మలకు ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి పూజలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం పట్టణమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆదివారం మండల కేంద్రంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లకు బోనాల ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏడాది ఇబ్రహీంపట్నంలో ఆషాఢమాసంలో మహంకాళి, శ్రావణ మాసంలో పోచమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయాలకు భక్తుల తాకిడి ఉదయం నుంచే ప్రారంభమైంది. సాయంత్రం భారీ సంఖ్యలో అమ్మవారికి బోనాలు, తొట్టెలను సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

పోచమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఆయా పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు.

కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దర్శన్



పాండుకు నియామకపత్రం అందజేస్తున్న రంగారెడ్డి

తుర్కయంజాల్: మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తుర్కయంజాల్‌కు చెందిన దర్శన్‌ను నియమిస్తున్నట్లు ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షురాలు మంగమ్మ ప్రకటించారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయనకు మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దర్శన్ మాట్లాడుతూ తనకు పదవిని కట్టబెట్టినందుకు రంగారెడ్డి, పార్టీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఐలయ్య, సునీల్, కోఆప్షన్ సభ్యులు కుతుబ్ అలీ, పీసీసీ సభ్యులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ అధ్యక్షుడిగా పాండు

ఇబ్రహీంపట్నం: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఇబ్రహీంపట్నంకు చెందిన పాండును నియమించారు. ఈ మేరకు ఆదివారం మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, జెడ్పీటీసీ మహిపాల్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా పాండు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేస్తానని తెలిపారు. సహకరించిన కాంగ్రెస్ శ్రేణులకు కృతజ్ఞతలను తెలియజేశారు.

గిరిజన సంప్రదాయానికి ప్రతీక 'తీజ్'

- ప్రకృతితో మమేకమై వేడుక
- పల్లెచెలకతండాలో సంబురాలు
- ప్రజాప్రతినిధులు, నాయకుల హాజరు



పల్లెచెలక తండాలో తీజ్ పండుగ సందడి

కడ్తాల్: గిరిజనుల సంస్కృతి సంప్రదాయలకు 'తీజ్' ఉత్సవాలు ప్రతీకలని, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. కడ్తాల్ మండలం పల్లెచెలకతండాలో గ్రామ సర్పంచ్ లోకేశ్‌నాయక్ ఆధ్వర్యంలో ఆదివారం 'తీజ్' వేడుకలను అంగరంగావైభవంగా నిర్వహించారు. వేడుకలకు బీజేపీ రాష్ట్ర నాయకులు ఆచారి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్త, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బీచ్యానాయక్ వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. నాయకులు, ప్రజాప్రతినిధులను తీజ్ మొలకల చావిడి వద్దకు తండా వాసులు ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారు మొలకల చావిడి వద్ద, స్థానిక ఆలయంలో పూజలు జరిపారు. మొలకల నిమజ్జన ఊరేగింపు సందర్భంగా గిరిజన యువతీ యువకులు సంప్రదాయ నృత్యాలు చేశారు. అనంతరం స్థానిక చెరువులో మొలకల బుట్టను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లోకేశ్, ఉప సర్పంచ్ సీతారాంనాయక్, చరికొండ సర్పంచ్ భారతమ్మ, ఎంపీటీసీ రాములుగౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు శ్రీనునాయక్, నర్సింహ, మహేందర్‌గౌడ్, చంద్రయ్యగౌడ్, హరిచంద్ర, కృష్ణయ్యగౌడ్, నర్సింహ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.